# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 28-11-2025** **సమయం : 6.45 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. **ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 15 బ్యాంకుల ప్రధాన కార్యాలయాలకు ఈరోజు శంకుస్థాపన చేస్తారు.**

2. **ఆంధ్రప్రదేశ్ రాజధాని ఫలాలు తొలుతగా అమరావతి రైతులకే దక్కాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

3. **తెలంగాణను దేశంలో వేగంగా ఎదుగుతున్న ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దేలా 'తెలంగాణ రైజింగ్-2047 పాలసీ'ని రూపొందించామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అన్నారు.**

4. **దేశంలో కార్మిక సంక్షేమానికి ఆదర్శ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచేలా చర్యలు తీసుకుంటున్నామని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు.**

5. **ఆంధ్రప్రదేశ్ లో ప్రణాళిక బద్ధంగా ఓడ రేవుల నిర్మాణాలను పూర్తి చేస్తామని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి వెల్లడించారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈరోజు పర్యటిస్తారు. ఇందులో భాగంగా రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ- సీఆర్డీఏ కార్యాలయం వద్ద నిర్మించనున్న 15 బ్యాంకుల ప్రధాన కార్యాలయాలకు శంకుస్థాపన చేస్తారు. ఈ కార్యక్రమంలో నిర్మలాసీతారామన్ తో పాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ రాష్ట్ర మంత్రులు పాల్గొంటారు. ఈ 15 బ్యాంకుల ద్వారా 1,328 కోట్ల రూపాయల పెట్టుబడులతోపాటు 6 వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు వస్తాయని అధికారులు తెలిపారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని ఫలాలు తొలుతగా అమరావతి రైతులకే దక్కాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రాజధాని రైతులతో ముఖ్యమంత్రి నిన్న సమావేశమయ్యారు. రైతుల తమకున్న సమస్యలను ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, అమరావతిని రాజధానిగా గుర్తించాలని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని, ఈ

అంశంపై మరోసారి కేంద్రంతో చర్చిస్తామని చెప్పారు. అమరావతిలో మరింత అభివృద్ధి జరుగుతుందని, ఇందుకోసం రెండో విడతలోనూ ల్యాండ్ పూలింగులో రైతుల నుంచి భూములు తీసుకుని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

---------------------------

తెలంగాణను దేశంలో వేగంగా ఎదుగుతున్న ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దేలా 'తెలంగాణ రైజింగ్-2047 పాలసీ'ని రూపొందించామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్'లో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్-2025'పై రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, మహిళా సాధికారత, యువశక్తి, స్థిరమైన అభివృద్ధి వంటి మూడు ప్రధాన రంగాలపై రాష్ట్ర అభివృద్ధి వ్యూహాన్ని ప్రభుత్వం రూపొందించిందన్నారు.

---------------------------

దేశంలో కార్మిక సంక్షేమానికి ఆదర్శ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచేలా చర్యలు తీసుకుంటున్నామని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు.కొత్త లేబర్ కోడ్స్ పై విజయవాడలో నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి కార్మికుడికి సకాలంలో సమాన వేతనం, సురక్షితమైన పని వాతావరణం కల్పించడమే ఈ చట్టాల లక్ష్యమని పేర్కొన్నారు.

వాయిస్ 27 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ప్రణాళిక బద్ధంగా ఓడ రేవుల నిర్మాణాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ 27 సెకన్లు

---------------------------

రబీ పంట కాలం దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ లో యూరియా కొరత తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయ శాఖపై మంత్రి నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు యూరియా సకాలంలో సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా డ్రోన్ పరికరాలను సద్వినియోగం చేసుకునే విధంగా రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఎరువుల అక్రమ రవాణా, నకిలీ విత్తనాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

దేశంలో పిల్లల దత్తత వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు, పిల్లల హక్కుల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి అనిల్ మాలిక్ అన్నారు. కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖకు చెందిన సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ మహిళా శిశు సంక్షేమ అథారిటీ,

ఆంధ్రప్రదేశ్ మహిళా, శిశు అభివృద్ధి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో విశాఖపట్నంలో నిర్వహించిన 'జాతీయ దత్తత అవగాహన –2025' ముగింపు సదస్సులో నిన్న ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిల్ మాలిక్ మాట్లాడుతూ, పిల్లలు లేని వారు దత్తత తీసుకునేందుకు చట్టబద్ధమైన వ్యవస్థ ద్వారా అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

---------------------------

గోవాలోని పణాజీలో జరుగుతున్న 56వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం – ఇఫీ ఈ రోజు తో ముగియనుంది. చలనచిత్రోత్సవంలో నటులు, చిత్రనిర్మాత అమీర్ ఖాన్ సామాజిక పరివర్తనపై మాస్టర్ క్లాస్ నిర్వహించారు. ఆయన తన చిత్రనిర్మాణం గురించి మాట్లాడుతూ, తాను ప్రస్తుత ట్రెండ్‌ల కంటే, వ్యక్తిగత అభిరుచికి, ప్రత్యేకమైన స్క్రిప్ట్‌లకు ప్రాధాన్యత ఇస్తానని అన్నారు. ఇక సినిమా ప్రదర్శనలలో " సోటోస్ – ఎ పొయెట్" చిత్రాన్ని ప్రదర్శించారు. అలాగే వి శాంతారామ్ 1946 నాటి చిత్రం – డాక్టర్ కోట్నిస్ కి అమర్ కహానీ, 1982 చెక్ చిత్రం – క్యాలమిటీ, మణిరత్నం దర్శకత్వం వహించిన 1989 నాటి తెలుగు చిత్రం గీతాంజలి వంటి పునరుద్ధరించబడిన క్లాసిక్‌లను ప్రదర్శించారు. ఈరోజు పణాజీలోని శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడియంలో ఇఫీ ముగింపు వేడుక జరుగుతుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో వచ్చే నెల 14 నుంచి వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఉచిత సివిల్స్ శిక్షణ ఇవ్వనున్నామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. విజయవాడలోని గొల్లపూడి బీసీ భవన్ లో ఉచిత సివిల్ సర్వీసెస్ ఇంటిగ్రేటెడ్ కోచింగ్ కోసం తీసుకుంటున్న చర్యలపై సంబంధిత అధికారులతో మంత్రి నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో రెండో విడత శిక్షణ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వంద మంది అభ్యర్థులకు శిక్షణనిచ్చేలా గొల్లపూడిలో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి వచ్చే నెల మూడో తేదీ వరకూ దరఖాస్తుల చేసుకోవాలని అన్నారు.

---------------------------

నైరుతి బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న శ్రీలంక తీరంలో తీవ్ర వాయుగుండం తుపానుగా మారిందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ తుఫానుకు 'దిత్వాహ్'గా నామకరణం చేసినట్టు అధికారులు తెలిపారు. ఉత్తర తమిళనాడు–పుదుచ్చేరికి ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తా తీరం వైపు తుఫాను కదులుతోందని ఆదివారం తెల్లవారుజామున తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణకోస్తా తీరాలకు చేరే అవకాశముందని తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని పలు జిల్లాలలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి కరుణాసాగర్ తెలియజేస్తూ,

వాయిస్ 22 సెకన్లు

దిత్వాహ్ తుఫాను నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ లోని అన్ని ఓడరేవుల్లో రెండో నంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశామని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ, తెలిపింది. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని,. రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

---------------------------

తెలంగాణ పార్లమెంట్ సభ్యులు పార్టీలకతీతంగా బృందంగా ఏర్పడి రాష్ట్ర ప్రయోజనాల కోసం కృషి చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లోఅఖిలపక్ష ఎంపీలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాజకీయాలకతీతంగా పార్లమెంట్ సభ్యుల సమావేశం ఏర్పాటు చేశామన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్లో చేర్చే అంశాన్ని పార్లమెంటు సమావేశాల్లో ప్రత్యేకంగా ప్రస్తావించాలని సూచించారు.

======================